
ప్రజాశక్తి
గురువారం 24 ఆగస్టు 2023



27న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న అండర్ 11,13,15 విభాగాల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వై.కుసుమబచన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పడాలపేటలో ఉన్న ఎపిక్ బాడ్మింటన్ కోర్టులో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సింగిల్ విభాగంలో రూ.300, డబుల్స్ విభాగంలో రూ.600 ఎంట్రీ ఫీజు 25 తేదీ లోపు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు విజయనగరం- శ్రీనివాసరావు 9133773485, బొబ్బిలి- అపర్ణ బాబా 7981111705, సాలూరు- అబ్దుల్ హక్ 9515729785, ఎస్.కోట- పి.శ్రీరాములు 7989199534, చీపురుపల్లి-పి.స్వరూప 9885830320, కొత్తవలస- వై.గణేష్ 9030185690 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

జయహో.. ఇస్రో

చంద్రయాన్ విజయవంతంతో జిల్లా వ్యాప్తంగా సంబరాలు

చంద్రయాన్-3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. జయహో ఇండియా, కంగ్రాట్యులేషన్స్ ఇస్రో, కంగ్రాట్స్ ఇస్రో.. నినాదాలు మిన్నంటాయి. జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ర్యాలీలు చేపట్టారు. ఆనంద సమయంలో స్వీట్లు పంచిపెట్టారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో ఇస్రో, చంద్రయాన్ రాకెట్ ఆకారాల్లో నమూనాలను ప్రదర్శించారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



చంద్రయాన్ ఆకృతిలో విద్యార్థులు

పూసపాటిరేగ : మండలంలోని పసుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ రాకెట్ నమూనా ఆకృతిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు, సభ్యులందరికు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పిఇటి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శృంగవరపుకోట

చంద్రయాన్-3 విజయవంతమైనందుకు గాను ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శృంగవరపుకోట పట్టణంలోని దేవి కూడలి వరకు త్రినేత్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జయహో ఇండియా, కంగ్రాట్యులేషన్ ఇస్రో.. అంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు.

బొబ్బిలి : చంద్రయాన్-3 విజయవంతం కావడం భారతదేశానికి గర్వకారణమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి



బొబ్బిలిలో స్వీట్లు పంచుతున్న గ్రీన్‌బెల్ట్ సొసైటీ సభ్యులు

రాజు అన్నారు. చంద్రయాన్ - 3 విజయవంతంతో పట్టణంలోని శ్వేతాచలపతి ఇంగ్లీషు మీడియం పాఠశాల వద్ద విద్యార్థులతో జాతీయ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు దేశానికి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. సాంకేతిక నైపుణ్యంతో దేశం ముందుకు వెళ్లాలని కోరారు. గ్రీన్ బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారతదేశానికి గర్వకారణమని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, సభ్యులు కృష్ణదాసు అన్నారు.

చంద్రయాన్ 3 విజయం గర్వకారణం

చంద్రయాన్ 3 విజయవంతం కావడం భారతీయులు అందరికీ గర్వకారణమని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పేర్కొన్నారు. ప్రపంచ దేశాల్లో చంద్రుని దక్షిణ భాగంలో కాలు మోపిన మొదటి దేశంగా భారత్ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. విక్రమ్ ల్యాండర్ చంద్రునిపై సాఫీగా చేరిన క్షణాలు మరపురానివని, ఎంతో క్లిష్టమైన ఈ ప్రక్రియను తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. వైజ్ఞానిక రంగంలో అగ్రగామిగా నిరూపించిన చంద్రయాన్ 3 భారత్ శక్తి వంతమైన దేశంగా బలపడడానికి ముందడుగుగా పేర్కొన్నారు. ఇది భారత్‌కు పండుగ రోజుఅని తెలిపారు.

శాస్త్రవేత్తలకు అభినందనలు

ఇస్రో ప్రవేశపెట్టిన చంద్రయాన్ 3 మిషన్ విజయవంతం అవ్వడం మనందరికీ గర్వకారణమని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారతదేశం పట్ల ప్రపంచం సగౌరవంగా తలెత్తి చూసి శుభ సమయం ఇదని పేర్కొన్నారు. ఈ విజయానికి కారణమైన, ఇస్రో - ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ శాస్త్రవేత్తలు అందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ అపురూపమైన ఘనత మన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుండి నాంది పలకడం, మన రాష్ట్రానికి మరింత మధుర స్మృతి అని పేర్కొన్నారు.



దుర్గాప్రసాద్ (ప్లానెటరీ శాస్త్రవేత్త)



శృంగవరపుకోటలో జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న త్రినేత్ర పాఠశాల విద్యార్థులు

చంద్రయాన్-3 విజయవంతంలో విజయనగర వాసులు



సతీష్ (సీనియర్ శాస్త్రవేత్త, ఇస్రో)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చంద్రయాన్-3 ల్యాండింగ్ గురించి దేశం మొత్తం ఉత్సుకతతో ఉండగా, విజయనగరానికి చెందిన డాక్టర్ కరణం దుర్గా ప్రసాద్ ఈ ముఖ్యమైన మిషన్‌లో భాగం కావడంతో విజయనగరం ప్రజలు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ కరణం దుర్గా ప్రసాద్ అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ (పి ఆర్ ఎల్) (అంతరిక్షం ఇస్రో యొక్క విభాగం)లో ప్లానెటరీ శాస్త్రవేత్త. అతను మొదటి నుంచి చంద్రయాన్-2, చంద్రయాన్-3 మిషన్‌లతో సంబంధం కలిగి ఉన్నారు. చంద్రా యొక్క ఉపరితల థర్మోఫిజికల్ ప్రయోగం అనే పరికరం యొక్క లీడ్స్‌లో ఒకరు. ఇది ఒక థర్మామీటర్ లాగా ఉంటుంది. చంద్రుని మొదటి ఉపరితలం యొక్క సిటు థర్మల్ ప్రొఫైల్‌ను అందించడానికి చంద్రుడి టాప్ 10 సెం.మీ ఉష్ణోగ్రతలను కొలుస్తుంది. ఇది భవిష్యత్తులో చంద్రుని అన్వేషణలో ముఖ్యమైన అంశం అయిన నీరు-మంచు, ఇతర వనరుల స్థిరత్వ మండలాల గురించి చెప్పే ముఖ్యమైన ప్రయోగం. ఇటీవలే, డాక్టర్ దుర్గా ప్రసాద్ అతని బృందం చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ చేయబోతున్న ప్రదేశాల గురించి సవివరమైన సర్ఫేస్ సైన్స్ అధ్యయనాన్ని కూడా నిర్వహించింది. ఈ పని ల్యాండింగ్‌కు ముందు ల్యాండింగ్ సైట్ లక్షణాలను అర్థం చేసుకోవడంలో మాత్రమే కాకుండా, కార్యకలాపాలను ప్లాన్ చేయడంలోను, చంద్రయాన్-3 ల్యాండర్ రోవర్‌లోని పరికరాల నుంచి శాస్త్రాన్ని పొందడంలో కూడా సహాయపడుతుంది.

ల్యాండింగ్ బృందంలో సతీష్

చంద్రయాన్-3 ల్యాండింగ్ టీమ్‌లో ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తగా సంతకవిటి మండలం సిరిపురానికి చెందిన బూరాడ సతీష్ సేవలందించారు. విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ కోసం కీలకమైన 25 మంది శాస్త్రవేత్తలతో ఇస్రో ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. అందులో సతీష్ ఒకరు కావడం జిల్లాకు గర్వకారణం.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రులు ముత్యాలనాయుడు, రాజన్నదొర

సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

ఉపముఖ్యమంత్రులు రాజన్నదొర, ముత్యాల నాయుడు

అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-దత్తిరాజేరు, మెంటాడ

ఈ నెల 25న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేసేందుకు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తో కలిసి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి జిల్లాకు వస్తున్న నేపథ్యంలో, పర్యటన ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు పీడిక రాజన్న దొర, బూడి ముత్యాల నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపిక, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి బుధవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. మరడాం లోని సభా ప్రాంగణం, హెలిపాడ్, చిన మేడపల్లి వద్ద శంకుస్థాపన జరిగే ప్రాంతాలను తనిఖీ చేశారు. అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. సభకు హాజరయ్యే వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విఐపిలు, ఇతరుల వాహనాలు పార్కింగ్ ఏర్పాట్లు ప్రణాళికా బద్ధంగా చేయాలన్నారు. హెలిపాడ్ వద్ద ముఖ్యులు వేచి ఉండటానికి అనువుగా టెంట్లు ఏర్పాట్లు చేయాలని, హెలిపాడ్ నుంచి శంకుస్తాపన ప్రాంతానికి వెళ్లి వచ్చే మార్గంలో వాహనాలను నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన సాగేదిలా..

ఈ నెల 25న కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు మరడాం చేరుకుంటారు.

- 10.30 నుంచి 10.40 వరకు ప్రజాప్రతినిధులతో ముఖాముఖి అవుతారు.
- 10.50 గంటలకు చినమేడపల్లికి రోడ్డు మార్గం గుండా చేరుకుంటారు.
- 10.50 నుంచి 11.10 వరకు యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.
- 11.20గంటలకు దత్తిరాజేరు మండలం మరడాం వద్ద ఏర్పాటుచేసిన సభా స్థలికి చేరుకుంటారు.
- 11.20 నుంచి 11.25వరకు జ్యోతి ప్రజ్వలన
- 11.25 నుంచి 11.45 వరకు కలెక్టర్, ఇతరప్రజాప్రతినిధుల ప్రసంగం
- 11.45 నుంచి 12గంటల వరకు కేంద్ర విద్యా శాఖా మంత్రి దర్మేంద్ర ప్రధాన్ ప్రసంగం
- 12 గంటల నుంచి 12.30 వరకు ముఖ్యమంత్రి ప్రసంగం
- 12.45గంటలకు హెలీప్యాడ్‌కు చేరుకొని విశాఖ పయనం

దేశ నాయకుల నుంచి స్ఫూర్తిని పొందాలి

టంగుటూరి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

దేశం కోసం పోరాటం చేసిన నాయకుల నుంచి స్ఫూర్తిని తీసుకొని వారు చూపిన మార్గాన్ని అనుసరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా జరిగింది కలెక్టర్ నాగలక్ష్మి, డిఆర్‌ఒ గణపతి రావు, పలువురు జిల్లా అధికారులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీష్‌వారిని ఎదురిస్తూ, తుపాకీకి ఎదురుగా నిలిచి, తన గుండె ను చూపిస్తూ దమ్ముంటే కాల్చండి అని నిలిచి, ఆంధ్రకేసరి అని పేరు పొందారని చెప్పారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించి, ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పదవిని అలంకరించారని కొనియాడారు.

తాను ప్రకాశం జిల్లాలో సంయుక్త కలెక్టర్ గా పని చేసిన కాలం లో ప్రకాశం పంతులు గృహాన్ని సందర్శించి, వారి గృహాన్ని మ్యూజియం గా మార్చాలని ప్రతిపాదనలు పంపినట్లు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పనులు కూడా జరుగుతున్నాయని అందుకు సంతృప్తి గా ఉందని అన్నారు. డిఆర్‌ఒ గణపతి రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం తన లాయర్ వృత్తిని, ఆస్తి ని వదులుకున్న దేశ భక్తుడని పేర్కొన్నారు.



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, డిఆర్‌ఒ గణపతిరావు

టంగుటూరికి జెడ్‌పిలో ఘన నివాళి

టంగుటూరి ప్రకాశం పంతులుకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటీష్‌వారిని ఎదురిస్తూ, తుపాకీకి ఎదురుగా నిలిచి, ఆంధ్రకేసరి అని పేరు పొందారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాపోలీసు కార్యాలయంలో...

టంగుటూరి జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్మ్‌డ్ రిజర్వు డిఎస్‌పి యూనివర్స్ హాజరైన ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎన్.గోపాలనాయుడు, డిసిఆర్‌బి ఎస్‌ఐ ప్రభావతి, ఆర్‌ఎస్‌ఐలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంతా చిన్నసన్నకారు రైతులు.. అందులోనూ గిరిజనులు, దళితులు, ఆర్థికంగా వెనుకబడిన బిసి రైతులే ఎక్కువగా ఉన్నారు. బహుశా అందుకేనేమో ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఎమ్మెల్యేలు ఎందరు వచ్చినా వీరికి సాగునీరు అందించాల్సిన గర్ల గెడ్డ జలాశయం గురించి పట్టించుకోవడం లేదు. నిధులు కేటాయించకపోవడం, అతి కొద్దిపాటి ఫారెస్ట్ ల్యాండ్‌కు క్లియరెన్స్ రాలేదంటూ సాకులు చూపడం ఇందుకు తార్కాణంగా చెప్పకోవచ్చు. దీంతో, పాతికేళ్లగా సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు కడగండ్లే మిగిలాయి. ఈనెల 25న సిఎం జగన్మోహన్‌రెడ్డి మెంటాడ మండలం వస్తున్న నేపథ్యంలో అసంపూర్తిగా వెక్కిరిస్తున్న జలాశయంపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.



గుర్లగెడ్డకు మోక్షమెప్పుడు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

- రూ.4.28కోట్ల అంచనా వ్యయంతో 2000లో ప్రారంభం
- నిధులు కేటాయించకపోవడంతో రూ.16కోట్లకు పెరిగిన అంచనా
- ఫారెస్టు అనుమతులు లేవనే సాకుతో 20 ఏళ్లుగా కాలక్షేపం
- పాతికేళ్లుగా రైతుల ఎదురు చూపు

మెంటాడ మండలం రొంపల్లి పరిధిలో గుర్ల గెడ్డ జలాశయాన్ని 2000లో అప్పటి టిడిపి ప్రభుత్వం రూ.4.28కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2900 ఎకరాలకు సాగునీరు అందించాలన్నది అప్పటి లక్ష్యం. వాస్తవానికి జలాశయం గట్టు పొడవు, ఎత్తు పెంచితే సుమారు 8వేల ఎకరాల వరకు సాగునీరు అందించవచ్చని ప్రజాదృక్కోణం గల సాగునీటి పారుదల శాఖ ఇంజినీర్లు అప్పట్లో చెప్పారు. ఇందుకు అనుగుణంగా ప్రాజెక్టు డిజైన్‌ను అప్‌గ్రేడ్ చేసి తగిన నిధులు కేటాయించాలని అప్పట్లో సిపిఎం నాయకులు కీర్తిశేషులు ఆర్.కుప్పానాయుడు ఆధ్వర్యాన రైతులు పెద్దపోరాటమే చేశారు. అయినా పట్టించుకోని ప్రభుత్వం 2,900 ఎకరాల ఆయకట్టుకే పరిమితం చేసి పనులు ప్రారంభించింది. ప్రధాన గట్టును దాదాపు నిర్మించినప్పటికీ, కొండవరకు ఉన్న 150 మీటర్ల మేర గట్టును అటవీ శాఖ అనుమతులు లేవనే సాకుతో అసంపూర్తిగా వదిలేసింది. ఇప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేవనే చెబుతున్నారు. మరోవైపు ఎడమ కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు జలాశయం నుంచి సుమారు కిలోమీటరు పొడవున అక్విడెక్టు నిర్మించారు. కుడికాలువ పనులు ఆదిలోనే హంసపాదులా నిలిచిపోయాయి. ఇదంతా 2004 ఎన్నికలకు ముందు మాట. ఆ తరువాత ప్రభుత్వం దీని గురించి పట్టించుకోకపోవడంతో అక్విడెక్టు మరమ్మతులకు గురైంది. రెండు చోట్ల పిల్లర్స్ కూడా విరిగిపోయాయి. అసంపూర్తిగా వున్న జలాశయ గట్టు యథాతథంగానే ఉంది. దీంతో, జలాశయం ద్వారా సాగునీరు అందని పరిస్థితి. జలాశయానికి పైనవున్న కొండకోనల నుంచి వచ్చిన నీరు గుర్లగెడ్డ ద్వారా చంపావతిలో కలిసిపోతుంది. ఈ సమస్యను సిపిఎం, ఎపి రైతు సంఘం మారిన ప్రతి ప్రభుత్వానికీ విన్నవించింది. స్థానికంగా అప్పటి రాష్ట్ర మంత్రి పడాల అరుణ మొదలుకుని తాడ్డి వెంకటరావు, బొత్స అప్పలనర్సయ్య, కెఎ నాయుడుల దృష్టికి తీసుకెళ్తనే ఉన్నారు. ఆయా సందర్భాల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం, ఆ తరువాత ప్రభుత్వానికి లేఖలు రాయడం మినహా ఒత్తిడి చేయలేదు. దీంతో, ఈ సాగునీటి ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. ఎన్నికల సమయాల్లో మాత్రం దీనిపై హామీలు గుప్పిస్తూ వస్తున్నారు. అందుకు తగ్గట్టు నిధులు కేటాయించకపోయినా సాగునీటి పారుదల శాఖ ద్వారా అప్పుడప్పుడు అంచనాలు తయారు చేయడం పరిపాటిగా మారింది. ఇందులో భాగంగా ఇటీవల రూ.16కోట్ల అంచనా రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. సిఎం జిల్లా పర్యటన నేపథ్యంలో గుర్లగెడ్డ ప్రాజెక్టుపై స్పందిస్తారని ప్రాజెక్టు ఆయకట్టుదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

సిఎం పర్యటనకు 2 వేల మందితో బందోబస్తు

ప్రజాశక్తి-విజయనగరం

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసేందుకు సిఎం జగన్మోహనరెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో సుమారు 2వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. బుధవారం బందోబస్తు సిబ్బందిని వివిధ కేటగిరిలుగా విభజించి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని బాధ్యులుగా నియమించామని తెలిపారు. హెలి ప్యాడ్, పార్కింగు, కాన్వాయ్, సభా స్థలం, శిలా ఫలకం, రూట్ బందోబస్తు, ట్రాఫిక్ రెగ్యులేషన్, ట్రాఫిక్ డైవర్షన్స్ విధులు నిర్వహించేందుకు ప్రత్యేకంగా అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. వాహనాల రాక, పోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే ప్రజల వాహనాలకు వేరువేరుగా పార్కింగు చేసుకొనే విధంగా పార్కింగు స్థలాలు ఏర్పాటు చేసామన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, బందోబస్తు నిమిత్తం ముగ్గురు అదనపు ఎస్‌పిలు, 11 మంది డిఎస్‌పిలతో సహా సుమారు 2వేల మందిని వినియోస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్, అల్లూరి సీతారామ రాజు జిల్లా అదనపు ఎస్‌పి అనిల్ పులిపాటి, జిల్లాకు చెందిన పలువురు డిఎస్‌పిలు,సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మెగా న్యాయ అవగాహన శిబిరంలో జిల్లా జడ్జి

ప్రజాశక్తి-విజయనగరం

నేటి సమాజంపై మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, వాటి వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి సూచించారు. విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. న్యాయ పరమైన అంశాలపై అందరికీ అవగాహన కల్పించేందుకు మెగా న్యాయ అవగాహన శిబిరాలు పెడుతున్నామని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన నల్సా తరహా మెగా న్యాయ అవగాహన శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగటం ద్వారా సమసమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారి



ప్రదర్శనలో ఏర్పాటుచేసిన గుడ్లను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి కళ్యాణచక్రవర్తి

పట్ల అందరూ మానవతా దృక్పథంలో నడుచుకోవాలని, వారికి తోచిన సహాయం అందించాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శన కేంద్రాలను ఆయన ప్రారంభించి పరిశీలించారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పరిశీలించి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును, వైఎస్సార్ కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించారు.

ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి పరికరాల అందజేత

గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సమకూర్చిన కృత్రిమ అవయవాలను ప్రత్యేక అవసరాలు కలిగిన పలువురికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి చేతుల మీదుగా అందజేశారు. ఆయనే స్వయంగా ప్రత్యేక అవసరాల గల వారి కాళ్లకు, చేతులకు అమర్చి సహకరించారు. కార్యక్రమంలో ఒకటో అదనపు కోర్టు జడ్జి జి. రజనీ, ఫ్యామిలీ కోర్టు జడ్జి ఎం. మీనాదేవి, ఎస్సీ, ఎస్టీ సెల్ కోర్టు జడ్జి షేక్ సికిందర్ షా, సీనియర్ సివిల్ జడ్జి బి. హెచ్.వి. లక్ష్మీకుమారి, ఒకటో తరగతి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి. రమ్య, మొబైల్ కోర్టు జడ్జి కె.ఎం. జమృత్ బేగం, బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ సి హెచ్. దామోదర్ రామ్మోహన్ రావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి జగదీష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వమిత్వపై జిల్లా స్థాయి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పంచాయతీ వనరుల కేంద్రంలో బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు 'స్వమిత్వ' పై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షకులకు శిక్షణ(టిఒటి) కార్యక్రమం నిర్వహించారు. జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, డిపిఒ ఎల్‌ఎన్‌వి శ్రీధర్ రాజా జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు. సిఇఒ రాజ్ కుమార్ మాట్లాడుతూ స్వమిత్వ పథకం అనేది కేంద్ర ప్రభుత్వ పాతకమన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, సర్వే ఆఫ్ ఇండియాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆస్తులకు సమగ్ర సర్వే చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. టిఒటి లుగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు, ఇఒఆర్‌డి లు ఈ కార్యక్రమంపై అవగాహన పెంపొందించుకొని గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలన్నారు. డిపిఒ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పంచాయతీ ఆస్తులు, ప్రజల ఆస్తులను గుర్తిస్తామన్నారు.

గద్దర్ పాటతో ప్రజా చైతన్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

గద్దర్ పాటతో ప్రజలను చైతన్యం చేశారని సీనియర్ న్యాయవాది పోల అరుణ్‌కుమార్, రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.వి.ఎస్ రాఘవరావు, దళిత, ఆదివాసీ ఐక్య వేదిక నాయకులు బి.అప్పారావు అన్నారు. స్థానిక గంటి ప్రసాదం భవనంలో బుధవారం దళిత, ఆదివాసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాటలతో ప్రజలను చైతన్యం చేస్తున్న గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు, బడుగు బలహీన వర్గాలకు, దళిత, గిరిజనులకు తీవ్ర నష్టమన్నారు. గద్దర్ ఆశయ సాధనకు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు



శృంగవరపుకోటలో రాస్తారోకో చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల రాస్తారోకో

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రమణ మాట్లాడుతూ హైకోర్టు తీర్పును అన్ని పంచాయతీల్లో అమలు చేయాలని, కార్మికులందరినీ యథావిధిగా బెందిలో నిమిత్తం లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం 18 వేలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, కార్మికులు పొట్నూరి నాగరాజు, తొత్తడి సన్నిబాబు, చంద్రయ్య, కృష్ణ, భాస్కర్, దాసు, అబద్ధం, మురళి, తాత తదితరులు పాల్గొన్నారు.

జామి : తమ సమస్యలను పరిష్కరించాలని గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన బుధవారం జామిలో రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, దండి శ్రీనివాసరావు మాట్లాడుతూ 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోని నాగరాజు, బోని అప్పారావు, చిప్పాడ వెంకటరావు, ఎస్.రాము, కొన్న సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్లు అధ్వానం

- నీటి సరఫరాలో లీకేజీలను అరికట్టాలి
- టిడిపి కార్పొరేటర్ రాధారాణి
- ఎన్నికల రాజకీయాలు చేయొద్దు
- వైసిపి కార్పొరేటర్ల మూకుమ్మడి మాటల దాడి
- సమాధానం రాకపోవడంతో వాకౌట్ చేసిన టిడిపి కార్పొరేటర్
- కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలు ఆమోదం



టిడిపి కార్పొరేటర్ రాధారాణితో వాగ్వివాదానికి దిగిన వైసిపి ఫ్లోర్‌లీడర్ రాజేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'అధ్యక్షా! నగరంలో సుందరీకరణ పేరుతో జరుగుతున్న పనులు ఒట్టి బూటకం. నగరంలో ప్రేమ సమాజం వద్ద ఉన్న గోతుల రోడ్డు, సింహాల్ జంక్షన్ వద్ద తాగునీటి పైపు లీకేజీ, వైఎస్ఆర్ నగర్ మెడికల్ కాలేజీకి వెళ్లే రోడ్డు దుస్థితి చూడండి. వాటికి అధికారులు సమాధానం చెప్పాలి' అంటూ టిడిపి 49వ డివిజన్ కార్పొరేటర్ కర్రోతు రాధారాణి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. వెంటనే లేచిన అధికార పార్టీ నామినేటెడ్ సభ్యులు ఆశపు వేణు, కార్పొరేటర్లు ఎస్‌వివి రాజేష్, బండారు ఆనంద్, కంటుభుక్త తవిటిరాజు, అల్లు చాణక్యలతో ఇద్దరు మహిళా వైసిపి కార్పొరేటర్లు మూకుమ్మడిగా టిడిపి కార్పొరేటర్ పై మాటలు దాడి చేశారు. మీ హయాంలో జరిగిన ఆస్తులు అమ్ముకొని అశోక్ గజపతిరాజు ఇంటికి రంగులు వేసుకుంటే మా కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో నగరంలో అభివృద్ధి జరుగుతుందని, అందుకు ఉదాహరణ 49వ డివిజన్‌కు రూ.50 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టడమేనని అన్నారు. తాను అధికారుల నుంచి, మేయర్ నుంచి సమాధానం అడిగితే మీరు ఎందుకు చెబుతున్నారంటూ పట్టు పట్టి మేయర్ కుర్చీ వద్దకు వచ్చి నిల్చున్నారు. అధికార పార్టీ కార్పొరేటర్లు మాటలు దాడి, అధికారులు నుంచి సమాధానం రాకపోవడంతో టిడిపి కార్పొరేటర్ కర్రోతు రాధారాణి సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు.

మేయర్ వి.విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎజెండాపై చర్చ జరుగుతున్నప్పుడు టిడిపి కార్పొరేటర్ రాధారాణి నగరంలో పలు ప్రాంతాల్లో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు, కాలువలు, నగరంలో తాగు నీటి పైపులైన్ల లీకేజీపై ఫోటోలతో పాటు కౌన్సిల్ సమావేశంలో ఉంచే ప్రయత్నం చేశారు. దీంతో అధికార పార్టీ కార్పొరేటర్లు, నామినేటెడ్ సభ్యులు వైసిపి పాలన కాలంలో చేసిన అభివృద్ధి మీకు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. కేవలం ఎన్నికలు దగ్గరకి వస్తున్నాయి కాబట్టి అశోక్ బంగ్లాలో రాసి ఇచ్చిన స్క్రిప్టును మీరు చదవడం ఎన్నికల లబ్ది కోసం తప్ప మరొకటి కాదన్నారు. అశోక్ గజపతిరాజు నగరాభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలన్నారు. నేడు రోడ్లు కాలువలు, వీధి లైట్లు, తాగు నీరు సరఫరా, జంక్షన్ల అభివృద్ధి చేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టిడిపి కార్పొరేటర్ స్పందిస్తూ నేడు నగరానికి తాగునీటి పథకం తెచ్చి నీరు ఇచ్చిన ఘనత అశోక్ గజపతిరాజుది అన్నారు. సమాధానం చెప్పకుండా కౌన్సిల్ సమావేశంలో తర్వాత ఎజెండా లో కి వెళ్లడంతో రాధారాణి సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. అనంతరం జరిగిన సాధారణ సమావేశంలో ఎజెండా లో 22 అంశాల్లో 20 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. రెండు అంశాలను వాయిదా వేశారు. తర్వాత జరిగిన అత్యవసర సమావేశం లో కూడా ఎజెండాలోని 9 అంశాలకు 7 అంశాలు ఆమోదించి రెండు అంశాలు వాయిదా వేశారు.



రోడ్ల చిత్రాలను చూపిస్తున్న కార్పొరేటర్ రాధారాణి

ఎజెండా రూప కల్పనపై మండిపడ్డ కార్పొరేటర్ రాజేష్

ఎజెండాలోని అంశాలపై చర్చ జరుగుతున్నప్పుడు వాటర్ వర్క్స్‌పై పెట్టిన అంశంపై స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్ వి వి రాజేష్ మండి పడ్డారు. ఎజెండా రూపొందించే విధానం ఇది కాదని, అర్థం కాని, కొత్త పదాలు ఉపయోగించి ఎజెండా తయారు చేయడం సరికాదన్నారు. కౌన్సిల్ సమావేశానికి వారం రోజులు ముందు ఎజెండా ఇవ్వాలని, కేవలం మూడు రోజులు ముందు ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

నగరాభివృద్ధే ధ్యేయంగా కృషి: మేయర్

నగర అభివృద్ధే ధ్యేయంగా తాము చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులు అభివృద్ధి చేస్తున్నామని, పెద్ద చెరువు గట్టును సుందరీకరిస్తున్నామని అన్నారు. పైడితల్లమ్మ జాతర సమయాని కల్లా ప్రధాన రహదారుల పనులు పూర్తి కావాలని అధికారులకు సూచించామన్నారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా గుర్తించిన పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని చెప్పారు. పనులు కూడా త్వరగా పూర్తయ్యే విధంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఎసిపి మధుసూదనరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ యాప్‌ను వినియోగించుకోండి

ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ వినియోగదారులు మెరుగైన సేవలు పొందడానికి ఇపిడిసిఎల్ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డౌన్ లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని విద్యుత్తుశాఖ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు తెలిపారు. 16 అంకెల సర్వీస్ నెంబర్‌ను ఎంటర్ చేసి, ఆధార్ నెంబర్‌ను లింక్ చేసుకుని, బిల్ పేమెంట్ చేసుకోవచ్చునని తెలిపారు. వినియోగదారులంతా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డ్రోన్ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్ పురం గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని తహశీల్దార్ ప్రశాంత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయరు అప్పలనాయుడు, సచివాలయ సర్వేయరు అరుణ, విఆర్ఒ పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యువత ఆలోచించి ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. బుధవారం మండలంలోని ఆలుగుబిల్లిలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమంలో మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను అన్ని విధాలా మోసం చేస్తున్నారని తెలిపారు. అధిక ధరలతో ప్రజల నడ్డి విరుస్తూ, సంక్షేమ ముసుగులో ఏదో చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ అరాచక ప్రభుత్వానికి చరమగీతం పాడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాయవరపు మహేశ్వరి, గొంప వేణు, గొంప మంగ, శిరికి దేముడమ్మ, రాయవరపు సన్యాసమ్మ, బీశెట్టి అరుణ, గొర్లె కన్నతల్లి పాల్గొన్నారు.

పింఛను దరఖాస్తుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

సామాజిక పింఛన్ల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్ బుధవారం పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి, పింఛన్లకు అర్హులా? కాదా? పరిశీలించారు. అర్హుల జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపిడిఒ తెలిపారు.



ఇన్వెస్ట్యూచర్ సెర్మనీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం

విద్యార్థులు విద్యతో పాటుగా బాల్యదశ నుండే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని తద్వారా ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరునిగా తయారవడానికి దోహదపడతాయని శ్రీ చైతన్య పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లో గల శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం 'ఇన్వెస్ట్యూచర్ సెర్మని' కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆర్ఐ శ్రీనివాసరావు ఇటీవల ప్రజాస్వామ్య స్ఫూర్తితో పాఠశాలలో జరిగిన ఎన్నికలలో ఎన్నికైన పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, స్పోర్ట్స్ ఇన్చార్జ్ విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. పాఠశాల క్రమశిక్షణ, అభివృద్ధి విషయంలో ఈ విద్యార్థులు నిరంతరం విద్యతో పాటుగా స్ఫూర్తిదాయకంగా ఉంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఆకర్షణీయమైన 'కవాత్' 'సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, పాఠశాల డీన్లు సత్యనారాయణ, సాయి కిషోర్, సూర్యచంద్ర, అప్పలనాయుడు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో అసౌకర్యాలు

ప్రజాశక్తి-మెరకముడిదాం

మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందికి కనీస సౌకర్యాలు లేవు. వారం రోజుల నుండి ఆరోగ్య కేంద్రంలో రన్నింగ్ వాటర్ లేదు. విద్యుత్తు సరఫరా సరిగా లేక, ఇన్వెర్టర్ సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. 24 గంటలూ వైద్యసేవలు అందించాల్సిన పిహెచ్‌సిలో అసౌకర్యాలతో సిబ్బంది అవస్థలు పడుతున్నారు. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఇంతవరకు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదు.

కళాశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలోని బాలికల జూనియర్ కళాశాలకు దాతలు బీరువాను అందజేశారు. కెఎస్ తిలక్ ఫౌండేషన్, దంతులూరి ప్రభావతి మెమోరియల్ ట్రస్ట్, సాగి జ్ఞానాంబ మెమోరియల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తెలుగు ఉపాధ్యాయులు జిఎస్ చలం బీరువాను అందించినట్లు హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

నేడు ఎంఆర్‌పిఎస్ సభ

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక మండల పరిషత్తు కాంప్లెక్సు ఆవరణలో గురువారం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు పెంకి సుధాకర్ మాదిగ తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి బుధవారం సభా ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం సభ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఆనందరావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, రాజు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు సర్కారు వెన్నుపోటు



మాట్లాడుతున్న ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.గౌరు

ప్రజాశక్తి-బాడంగి

ఆదివాసీల సమస్యలను ఏనాడూ పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం.. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని నిర్ణయించి గిరిజనులకు వెన్నుపోటు పొడిచిందని టిడిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస గౌరు ధ్వజమెత్తారు. బుధవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించారు. ఎరుకుల, గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం టిడిపి అధికారంలోకి రావాలని, అందుకు ప్రతి కార్యకర్తా కష్టపడి పనిచేయాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బాగా చదివితే ఉపాధి అవకాశాలు మెండు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విద్యార్థులు బాగా చదువుకుంటే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని సెంచూరియన్ విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు వెల్లడించారు. బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల అనుభవాలపై వర్చువల్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇంజనీరింగ్, పారా మెడికల్ విద్యార్థులు తమ అనుభవాలను వివరించారు. విద్యార్థులు ఏ విధంగా నడచుకుంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయో తెలిపారు. బిటెక్ సిఎస్ఇ విద్యార్థి నవీన్ మాట్లాడుతూ ఏయే కోర్సులకు గిరాకీ ఉంది, ఏ లాంగ్వేజీలలో ప్రావీణ్యత ఉండాలన్న విషయాన్ని తెలిపారు. రేడియాలజీ విద్యార్థి ఎం.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను యుకెలో మెడికల్ ఇమేజింగ్ చదువుతున్నానని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, పారామెడికల్ డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, ఆసిఫ్, మజీద్ పాల్గొన్నారు.



గడిగెడ్డ నీరు విడుదల చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గడిగెడ్డ నీరు విడుదల

ప్రజాశక్తి-గుర్ల

మండలంలని గడిగెడ్డ ప్రాజెక్టు నుంచి బుధవారం సాగునీటిని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిగెడ్డలో పూర్తిస్థాయిలో ప్రస్తుతం నీరు నిల్వ లేదని, ఉన్న నీటిని రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటిని వృథా చేయొద్దని కోరారు. కార్యక్రమంలో డిఎల్‌డిఎ చైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, ఇరిగేషన్ డిఇ సంతోష్ కుమార్, జెఇ శ్రీనివాసరావు, తెట్టంగి పిఎసిఎస్ చైర్మన్ టివిఎన్ రాజు, వైస్ ఎంపిపి తిరుపతిరావు, పి.సన్యాసినాయుడు, ఎంపిటిసి బి.జోగినాయుడు, మాజీ సర్పంచ్ జమ్ము స్వామినాయుడు, మాజీ ఎంపిటిసి రాగోలు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా దరఖాస్తుల పరిశీలన

టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు

ప్రజాశక్తి-వేపాడ



పింఛన్ల కోసం చేసుకున్న దరఖాస్తుల పరిశీలనను అధికారులు ఇష్టానుసారంగా చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ ఒక్క సచివాలయంలో కూడా పూర్తిస్థాయిలో పింఛన్లు మంజూరు చేయడం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం లేదని చెప్పారు. బానాది గ్రామంలో 20 మంది దరఖాస్తు చేయగా 9 మందికి మాత్రమే వెరిఫికేషన్ చేస్తున్నారని తెలిపారు. సోంపురంలో 10 మంది దరఖాస్తు చేయగా నలుగురికి మాత్రమే పరిశీలిస్తున్నారని, కెజెపూడిలో 23 మంది దరఖాస్తుదారులకు ఒకరికి మాత్రమే వెరిఫికేషన్ వచ్చిందని చెప్పారు. బొద్దాంలో 13 మంది దరఖాస్తు చేయగా మాత్రమే నలుగురికి, జాకేరులో 20 మందికి ఏడుగురు మాత్రమే పరిశీలనకు రావడం సరికాదని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని, ఇష్టానుసారంగా నిర్ణయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి దరఖాస్తులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.

పోగొట్టుకున్న సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం



సర్టిఫికెట్లను అందజేస్తున్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది

రైలులో ప్రయాణిస్తూ పోగొట్టుకున్న విద్యాసంబంధిత సర్టిఫికెట్లను ఆర్‌పిఎఫ్ పోలీసులు బాధితునికి అందజేశారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం పాలవలసకు చెందిన కరణం ఢిల్లీశ్వరరావు తన కుమారుడిని పాట్నా ఎన్‌టిఐలో చేర్పించారు. తిరుగుముఖంలో భువనేశ్వర్ నుంచి శ్రీకాకుళం రైలులో వస్తూ కుమారుడికి చెందిన ఒరిజినల్ సర్టిఫికెట్లు మరిచిపోయి ఆముదావలసలో దిగిపోయారు. వెంటనే అక్కడి ఆర్‌పిఎఫ్ సిబ్బంది ద్వారా విజయనగరం ఆర్‌పిఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆర్‌పిఎఫ్ ఎస్ఐ సుస్మిత స్పందించి వెంటనే ఎసి బోగిలో తనిఖీ చేయించి సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీశ్వరరావుకు సమాచారం ఇవ్వడంతో ఆయన విజయనగరం రావడంతో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌పిఎఫ్ పోలీసులకు ఢిల్లీశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజానాయకుడు టంగుటూరి

రామభద్రపురం : నాయుడువలస ఎంపిపి పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని హెచ్‌ఎం రెడ్డి వేణు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జెసి రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొప్పే రవి, శివున్నాయుడు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

వేపాడ : ఎంపిడిఒ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, వైసిపి నాయకులు బోజంకి శ్రీను, బీల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ టి.వి.ఎస్.విశ్వేశ్వరరావు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి మహంతి కళ్యాణి తెలిపారు. బుధవారం మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరిగే అభివృద్ధి పనులు, వ్యాధులు, మందులు, తదితర అంశాలపై వైద్యులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.రామారావు, వైద్యాధికారులు రాజ్‌కుమార్, భాగ్యరేఖ, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ సూచించారు. మున్సిపాలిటీలోని 9వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

శ్మశానవాటికకు రహదారి నిర్మాణంపై హర్షం

ముస్లిముల శ్మశానవాటికకు సిసి రోడ్డు నిర్మాణం చేయడంతో ముస్లిములు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్య పరిష్కారం అయిందని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ అన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు, చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణకు ధన్యవాదాలు చెప్పారు.

నిత్యావసర సరుకులు వితరణ

ప్రజాశక్తి - గరివిడి

పట్టణంలో గర్భాం రోడ్‌లో నివాసం ఉంటున్న బోర రాంబాబు అనే వికలాంగుడి భార్య మరణించింది. పిల్లలు ఆదరించడం లేదు. కనీసం తినడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి. దీంతో వైసిపి వికలాంగుల విభాగం, శ్రీవిజయ దుర్గ వికలాంగుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దవడ కొండబాబు, రమ్య, బలరాం, వివన్ మూర్తి, చింతల నారాయణ, బోర్ వెల్స్ రామారావు, బొగ్గు బాబ్జీరావు, కొర్నాన రమణ, తదితరులు పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో గడపగడపకు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 43వ డివిజన్ కంటోన్మెంట్, ఉడా కాలనీ ఫేజ్ 2 ప్రాంతంలో బుధవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు కోలగట్ల తమ్మన్న శెట్టి, డాక్టర్ వి ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల తమ్మన్నశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరును తెలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యల పైన ఆరాతీసి వాటి పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. స్థానిక కార్పొరేటర్ దాసరి సత్యవతి, డివిజన్ అధ్యక్షుడు వంతరాం సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాట్లు వేస్తున్న విద్యార్థులు

నాట్లు వేసిన విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నెల్లిమర్లలోని ఆదిత్య విద్యాలయం స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సిసి విద్యార్థులు బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పించారు. మండలంలోని జగ్గరాజుపేట గ్రామానికి తీసుకెళ్లి, నేరుగా విద్యార్థులతో నాట్లు వేయించారు. పొలంలో వరి పండించే విధానాన్ని రైతులతో వివరించారు. ప్రతి ధాన్యపు గింజ పండించడానికి రైతులు ఎంతో శ్రమిస్తారని, అందుకే అన్నం వృథా చేయరాదని పాఠశాల హెచ్‌ఎం వి.అమృత, డైరెక్టర్ డాక్టర్ వి.సూరిబాబు విద్యార్థులకు సూచించారు.